చెదురుతున్న రంగులు



అమ్మకానికి సిద్ధంగా కేసిమెట్ బట్ట

- సిరిసిల్లలో అద్దకం పరిశ్రమ వెలవెల
- తగ్గిన కాటన్ ఉత్పత్తితో ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- 270 డైయింగ్ పరిశ్రమలు మూత
- అరకొరగా నడుస్తున్న 30 పరిశ్రమలు
- తమిళనాడు నుంచి తీవ్ర పోటీ
- పరిశ్రమ మూతపడే పరిస్థితి



డైయింగ్ యూనిట్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల అనగానే అందరికి గుర్తుకు వచ్చేది మరమగ్గాల చప్పుళ్లు. వాటికి అనుబంధంగా ఉండే రంగు రంగుల అద్దకం పరిశ్రమ. దక్షిణాది రాష్ట్రాలకు పెటీకోట్స్ బట్ట అందిస్తున్న సిరిసిల్ల కాటన్ అద్దకం పరిశ్రమ రంగులు చెదిరిపోతున్నాయి. దీంతో కార్మికులకు ఉపాధిని దూరం అవుతోంది. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లోని పరిశ్రమలతో తీవ్ర పోటీని ఎదుర్కొని నిలబడే ప్రయత్నం చేస్తున్నా రంగులు, రసాయనాల ధరలు పెరిగిపోవడంతో అద్దకం కూలి గిట్టుబాటు కాని పరిస్థితులు నెలకొన్నాయి. బతుకమ్మ చీరలతో పాటు పెటీకోట్స్ ఇవ్వాలని అద్దకం పరిశ్రమ యజమాన్యం, కార్మికులు కోరుతున్నా ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో అనేక పరిశ్రమలు మూత పడ్డాయి.

డైయింగ్, సైజింగ్‌లకు మొదలైన కష్టాలు

సిరిసిల్లలో 37 వేల మరమగ్గాలు ఉండగా వీటిలో ఎక్కువ శాతం బతుకమ్మ చీరలు, ఇతర పాలిస్టర్ బట్ట ఉత్పత్తి మొదలైంది. బతుకమ్మ చీరల ఆర్డర్లతో కాటన్ బట్ట ఉత్పత్తి నిలిచిపోయింది. గతంలో దాదాపు 15 వేల మరమగ్గాలపై నడిచే కాటన్ ఉత్పత్తి ఇప్పుడు 800 మరమగ్గాలకు పడిపోయింది. కాటన్ ఉత్పత్తులకు అనుబంధంగా మొదలైన 28 సైజింగ్‌ల్లో 14 మూతపడ్డాయి. దీనికి తోడు కాటన్, రసాయనాల ధరలు కూడా పెరిగిపోయాయి. మార్కెట్‌లో బట్ట ఉత్పత్తికి ధర పెరగకపోవడంతో పరిశ్రమ ఇబ్బందుల్లో పడింది. ఇప్పుడు 10 సైజింగ్‌లు నడుస్తున్నా నెలకు 15 రోజులు మాత్రమే కార్మికులకు పని దొరుకుతోంది. మరోవైపు 300 డైయింగ్ పరిశ్రమల్లో 270 వరకు మూతపడ్డాయి. 30 డైయింగ్‌లు నామమాత్రంగా అద్దకం జరుపుతున్నాయి.


నెలలో కేవలం 2 వారాలు మాత్రమే కార్మికులకు పని ఉంటోంది. పూర్తి స్థాయిలో పని ఉంటే ఒక కార్మికుడు నెలకు రూ.15 వేల వరకు సంపాదించుకునే వారు. ప్రస్తుతం రూ.6 వేలకు మించి లభించడం లేదు. అద్దకం పనిలేని రోజు ఇతర పనులు చేసు కుంటున్నారు. గతంలో అద్దకం సైజింగ్ పరిశ్రమపై 5వేల మంది ఉపాధి పొందేవారు ప్రస్తుతం వారు ప్రత్యామ్నాయ వృత్తుల్లోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం వెయ్యి మంది వరకు పనులు చేస్తుండగా ఆ పనులు కూడా దొరకని పరిస్థితి. గతంలో సిరిసిల్ల డైయింగ్ పరిశ్రమ నుంచి రంగుల బట్ట దక్షిణాది రాష్ట్రాలకు ఎగుమతులు జరిగేవి. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లోని తమిళనాడు, గుజరాత్‌లలో అద్దకం పరిశ్ర మలకు రాయితీలు ఇవ్వడం రాజస్థాన్‌లోని బల హోత్రాలో ఆధునిక డైయింగ్ యూనిట్లు రావడం వాటికి అక్కడి ప్రభుత్వాల ప్రోత్సాహం ఉండడంతో సిరిసిల్ల అద్దకం పరిశ్రమ మూత పడే పరిస్థితి ఏర్పడింది. తెలంగాణలోని కొత్త ప్రభుత్వం వస్త్ర పరిశ్రమపై ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటోందననే కార్మికుల్లో ఆసక్తి నెలకొంది. అద్దకం పరిశ్రమకు కూడా ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరుతున్నారు.

దక్షిణాది రాష్ట్రాలకు రంగుల బట్ట

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఎంతో ఎత్తుకు ఎదుగుతూ మరమగ్గాలు, అనుబంధ పరిశ్రమల వైపు అడుగులు వేసింది. మరమగ్గాలపై కాటన్ వస్త్రాలు ఉత్పత్తి అయితే వాటికి రంగులు అద్ది దక్షిణాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ అగ్రగామిగా నిలిచింది. చిన్న చిన్న యంత్రాలతో కుటీర పరిశ్రమగా రంగుల ప్రపంచంలో ఎంతో మందికి ఉపాధి లభించింది. ఆధునిక యంత్రాలు, మిల్లు బట్ట నుంచి ఎదురైన పోటీతో పరిస్థితులు తలకిందులయ్యాయి. మరమగ్గాలకు అనుబంధంగా ఉన్న అద్దకం పరిశ్రమ కష్టాల్లో పడింది.

సిరిసిల్లలో 37 వేల మర మగ్గాలు ఉంటే అందులో 15 వేలకు పైగా మరమగ్గాలపై కాటన్ బట్ట ఉత్పత్తి జరిగేది. మిగతా మరమగ్గా లపై పాలిస్టర్ బట్ట ఉత్పత్తి అయ్యేది. కాటన్ ఉత్పత్తికి అనుబంధంగా 28 సైజింగ్‌లు, 300కు పైగా డైయింగ్ యూనిట్లు పనిచేసేవి. తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఆధునిక డైయింగ్ యంత్రాలు ఉపయోగించడంతో సిరి సిల్ల అద్దకం పరిశ్రమకు తీవ్ర పోటీ ఏర్పడింది. మరమగ్గాల పరిశ్రమలో తరచూ తలెత్తే సంక్షోభం పాలిస్టర్, కాటన్ వస్త్రోత్పత్తికి విఘాతం కలిగేవి. కార్మికుల ఆత్మహత్యలు పనులు లేక పరిశ్రమలు మూతపడేవి.

దీంతో కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కుదిపేసేవి. తెలంగాణ ప్రభుత్వం సిరిసిల్ల కార్మి కులకు చేతినిండా పని కల్పించాలనే లక్ష్యంగా బతుకమ్మ పండుగకు ఆడపడుచులకు చీర కానుకగా అందించడానికి నిర్ణయించింది. 2017 నుంచి బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లను సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు అందించి ఉపాధి కల్పిస్తున్నారు. ఏటా కోటి చీరలు ఉత్పత్తి చేస్తున్నారు. మరమగ్గాలపై కాటన్ ఉత్పత్తి నిలిచిపోయి బతుకమ్మ చీరలు మొదలవడంతో అనుంబంధ పరిశ్రమలు సంక్షోభంలో చిక్కాయి.



అద్దకమైన బట్ట

ఆరో రోజు 26,365 దరఖాస్తులు

సిరిసిల్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాల్లో అభయ హస్తం, ఆరు గ్యారెంటీల పథకాలకు సంబంధించి ప్రజలు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆరో రోజు గురువారం 28 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపల్ వార్డుల్లో జరిగిన ప్రజాపాలనలో 26,365 అభయ హస్తం దరఖాస్తులు వచ్చాయి.ఇతర వాటికి 5033 దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 138350 దరఖాస్తులు వచ్చాయి.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో భారీగా దరఖాస్తు వచ్చాయి. కార్యక్రమంలో భాగంగా 29 కౌంటర్లను ఏర్పాటు చేశారు. 3,114 దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ భూపతి, ఉప సర్పంచ్ నాగరాజు, పలవురు ఎంపీటీసీలు, పలువురు వార్డు సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలో 2024 - 25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో గురుకుల ప్రచార పోస్టర్‌ను డీపీఆర్వో దశరథం, గురుకులాల జిల్లా సమన్వయక కర్త జాక్విలిన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరూ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం 6వ తేదీలోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సన్మానం

గంభీరావుపేట, జనవరి 4 : గంభీరావుపేట మండల కేంద్రానికి గురువారం వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కాంగ్రెస్ ఆధ్వర్యంలో షాదీఖానలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మండల, జిల్లా స్థాయి పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కొండూరు గాంధీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు సురేష్, మండలంలోని పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇల్లు ఇప్పించండి

గంభీరావుపేట, జనవరి 4 : డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయించాలని వృద్ధురాలు వేడుకుంది. గంభీరావుపేటలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎదుట మండల కేంద్రానికి చెందిన రజియా బేగం అనే వృద్ధురాలు కన్నీటి పర్యంతమైంది. డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తనకు ఇల్లు రాలేదని పేర్కొంది. తన భర్త చనిపోయాడని, కూతురు మానసిక వికలాంగురాలని, కొడుకు కూలీ పనిచేస్తాడని కుటుంబ పరిస్థితిని చెప్పుకుంది. స్పందించిన ఆది శ్రీనివాస్ ఆమెకు న్యాయం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌కు సూచించారు.

సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

కోనరావుపేట, జనవరి 4 : సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బానోతు నరేష్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవలాల్ మహరాజ్ జయంతిని ప్రభత్వం సెలవు దినంగా ప్రకటించాలి కోరినట్లు చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో దర్సింగ్‌నాయక్, రమేష్‌నాయక్, మహేందర్ తదితరులు ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంస్థాగతంగా ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని, ప్రగతిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, నిర్మాణాల పురోగతి, టీబీ పరీక్షలు, దోమల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు, రిస్క్ ఉన్న కేసులను జిల్లా ఆసుపత్రికి, ఏరియా ఆసుపత్రులకు పంపించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల శాతం తగ్గుదలపై చర్చించారు. జిల్లాలో నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 57 ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణ పురోగతిపై సమీక్షించి 33 ఆరోగ్య ఉపకేంద్రాలు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగతా వాటిని పూర్తి చేయాలని అన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన వాటికి సంబంధించి ఫొటోలతో రావాలన్నారు. డెంగ్యూ, మలేరియా టైఫాయిడ్ కేసులను పూర్తిగా అరికట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. కొవిడ్ వ్యాపిస్తున్న నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కిరణం కార్యక్రమం కింద ఫిజికల్ హెల్త్, మెంటల్ హెల్త్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌గౌతమి. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, ఈఈలు రమేష్, సూర్యప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు మీర్జాఫసత్ అలీబేగ్, అన్వేష్, డాక్టర్ మురళీధర్‌రావు, డాక్టర్ మహేష్‌రావు, డాక్టర్ సంతోష్, డాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



పడిపూజలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, జనవరి 4: సిరిసిల్ల పట్టణంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం సాగర్ గురుస్వామి ఆధ్వర్యంలో చొప్పదండి ప్రమోద్ అయ్యప్ప స్వామి మహా పడిపూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొన్న అనంతరం పడిపూజలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గురుస్వామి మ్యాన ప్రసాద్, కౌన్సిలర్ చొప్పదండి లలిత, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సామల పావనిదేవదాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం నర్సయ్య, వెల్ముల తిరుపతిరెడ్డి, కాసర్ల రాజు, గురుస్వామి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

సిరిసిల్ల క్రైం, జనవరి 4: సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఉదయం పోలీసు, పాత్రికేయులకు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ప్రెస్‌క్లబ్‌లతోపాటు అన్ని మండలాలకు చెందిన పోలీసులు, పాత్రికేయులు మ్యాచ్ ఆడేందుకు సిద్ధమయ్యారు. మ్యాచ్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించనున్నారు.

దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్

సిరిసిల్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఆసరా పింఛన్‌లతో పాటు నైపుణ్యాలు పెంపొందించడానికి శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం సిరిసిల్లలోని సఖి కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని నిర్వహించారు. దివ్యాంగులకు ఆర్థిక పునరావాస పథకంలో గ్రౌండింగ్ చేసిన యూనిట్ల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆర్థిక సహాయం, పునరావాసం, అర్హుల వివరాలను సేకరించాలని కోరారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ దివ్యాంగుల భవన్‌కు సంబంధించిన స్థలాన్ని సేకరించి ఇవ్వడానికి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ దివ్యాంగులు ఉచిత బస్‌పాస్ కోసం వచ్చిన డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామ న్నారు. అవసరమైన వారు చేతి కర్రలు, పరికరాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీడీపీవోలు ఎల్లయ్య, అలేఖ్య, సుచరిత, అనందిని. డీహెచ్ రోజా, సఖి కేంద్రం విజయ, డీసీపీవో స్వర్ణలత, బాలకృష్ణ, సంతోష్, దివ్యాంగ సమితి ప్రతినిధులు తిరుపతి, రాజేందర్, నరేష్ పాల్గొన్నారు.

'ఆది'కి నూతన సంవత్సర శుభాకాంక్షలు

కలెక్టరేట్‌కు వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. గురువారం కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్‌లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆది శ్రీనివాస్ అభివృద్ధి పనుల పురోగతి, ప్రజాపాలన సదస్సులపై చర్చించారు.

వాహనాల తనిఖీ

మానకొండూర్, జనవరి 4: మానకొండూర్‌లోని తూర్పుదర్వాజ బస్టాండ్ వద్ద సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఇసుక లారీలు, వాహనాల కాగితాలు, డ్రంకన్‌డ్రైవ్ నిర్వహించారు. తనిఖీల్లో ఎస్సై శ్రీకాంత్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

యువతి గొంతుకోసిన యువకుడు

- ప్రేమ వేధింపులే కారణం



బొద్దుల సాయి, ఆడెపు కావ్యశ్రీ(ఫైల్)

కరీంనగర్ క్రైం, జనవరి 4: తనతో పెళ్లికి నిరాకరించిందని ఓ యువకుడు యువతితో గొడవ పడి ఆమె గొంతుకోశాడు. కొత్తపల్లికి పట్టణానికి చెందిన ఆడెపు కావ్యశ్రీ(26) అనే యువతి ఇంటిలోకి గురువారం సాయంత్రం అదే పట్టణానికి చెందిన బొద్దుల సాయి అనే యువకుడు వెళ్లాడు. కావ్యశ్రీతో గొడవపడి, ఆ తరువాత వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. మెడకు ఇరువైపులా గాయపరచగా, చేతులు అడ్డుపెట్టిన సమయంలో కావ్యశ్రీ వేళ్లకు గాయాలయ్యాయి. కరీంనగర్ రూరల్ ఏసీపీ, యువతి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గురువారం సాయంత్రం కావ్యశ్రీ ఇంటిలో ఒంటరిగా ఉండగా కత్తి దాడి చేశాడు. గాయపడ్డ కావ్యశ్రీ అరవడంతో అక్కడికి వచ్చిన స్థానికులను చూసి సాయి పారిపోయాడు. విషయం తెలుసుకున్న కావ్యశ్రీ బాబాయి శ్రీనివాస్ వచ్చి చూసేసరికి ఆమె రక్తపుమడుగులో సొమ్మసిల్లి పడిపోయి ఉంది. వెంటనే ఆమెను వాహనంలో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కావ్యశ్రీకి వైద్య చికిత్సలు అందిస్తున్నారని, ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉందని ఏసీపీ టి కరుణాకర్‌రావు తెలిపారు. నిందితుడు సాయి కోసం పోలీసు టీంలు గాలింపు ప్రారంభించాయని తెలిపారు. పెళ్లికి నిరాకరించడంతోనే సాయి దాడికి పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. కాగా కావ్యశ్రీ ఎదురు ఇంటిలోనే సాయి ఉంటాడు. నాలుగు ఏళ్ల నుంచి కావ్యశ్రీ, సాయిల మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోంది. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగినట్లు తెలిసింది. కావ్యశ్రీ ఎమ్మెస్సీ మ్యాథ్స్ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా, సాయి ఒక ఇసుక క్వారీలో ఉద్యోగం చేస్తున్నాడు. నీ కూతురును నాకంటే ఎవరూ బాగా చూసుకోలేరు.. తనకు నాతో వివాహం చేయాలంటూ వారం రోజుల కిందటే కావ్యశ్రీ తండ్రి వీరేశంకు సాయి ఒక మెస్సేజ్‌ను పంపించాడు. దీనిని వీరేశం పట్టించుకోలేదు. దీంతో గురువారం కూడా మరోమారు మెస్సేజ్‌ను పంపించాడు. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో కావ్యశ్రీ ఇంటి వద్ద ఒంటరిగా ఉందని నిర్ధారించుకున్న సాయి పథకం ప్రకారమే వెంట కత్తి తీసుకొని కావ్యశ్రీ వద్దకు వెళ్లాడు. తనను పెళ్లి చేసుకోవాలంటూ సాయి ఒత్తిడి తెచ్చి గొడవపడ్డాడు. అయినప్పటికీ ఆమె పెళ్లికి నిరాకరించటంతో కత్తితో మెడపై రెండు వైపులా తీవ్రంగా గాయపరిచాడు. చేతి వేళ్లు తెగిపోయి తీవ్ర రక్తస్రావమైంది. సాయిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ తెలిపారు.

9న మధ్యప్రదేశ్ మాజీ సీఎం రాక

మానకొండూర్, జనవరి 4: మండలంలోని కొండపల్కల గ్రామానికి మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రానున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌రావు తెలిపారు. వికసితు భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఈ నెల 9న మాజీ సీఎం పాల్గొనే సభ స్థలాన్ని అధికారులతో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, సర్పంచు నల్ల వంశీధర్‌రెడ్డి, ఎంపీటీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌లో మద్యం సీజ్

సిరిసిల్ల క్రైం, జనవరి 4: సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు గ్రామం బాబాజీనగర్‌లోని ఓ బెల్ట్‌షాప్‌లో కడమంచి ఎల్లవ్వ అనే మహిళ గురువారం అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీజ్‌చేశారు. సిరిసిల్ల వైన్స్‌ల నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి బెల్ట్‌షాప్‌లో అధికధరలకు విక్రయిస్తున్నారని, ఈ మేరకు రూ. 2340విలువ గల మద్యం సీజ్ చేశామని టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి తనిఖీ

- సాధారణ ప్రసవాలు పెంచాలని సిబ్బందికి డీఎంహెచ్‌వో సూచన

హుజూరాబాద్, జనవరి 4: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని డీఎంహెచ్‌వో లలితాదేవి గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో బీపీ, పీపీ, ఐసీటీసీ హెల్ప్ డెస్కులను పరిశీలించారు. గర్భిణులకు నాణ్యమైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఏరియా ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు ఎక్కువగా అయ్యేలా సిబ్బంది చూడాలని ఆదేశించారు. అలాగే శంకరపట్నం, చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం పట్టణంలోని మామిండ్లవాడలో ఉప కేంద్రం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కరీంనగర్, హుజూరాబాద్ సూపరింటెండెంట్లు డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ సుధాకర్‌రావు, డాక్టర్ నారాయణరెడ్డి, పంజాల ప్రతాప్, సాజీత్ హుస్సేన్, తులసి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు



అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

చొప్పదండి, జనవరి 4: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయం తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీకి ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలు ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని, ఆలయ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడిగె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, గురుస్వాములు గొల్లపెల్లి శ్రావణ్ కుమార్, సింహాచలం హరికృష్ణ, బొడిగె వెంకన్న, ఎన్నం మునీందర్, ఉషికే రాజశేఖర్ రెడ్డి, మునిగాల సుధాకర్, ఎలిగేటి రాములు, కట్ట సత్యం, బత్తిని ప్రశాంత్, పోతు రాజు, బైరగోని కిట్టుగౌడ్, గుర్రం సమర్ రెడ్డి, కటుకం శశాంక్, కొత్తూరి శంకర్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



కుమారస్వామి(ఫైల్)

ఇల్లందకుంట, జనవరి 4: మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన నందికొండ కుమారస్వామి (46) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమారస్వామికి ఇద్దరు కుమార్తెలు, కొడుకు, భార్య ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల వివాహం చేశాడు. ఈ సందర్భంలో రూ. 3.50లక్షలు అప్పు చేవాడు. అప్పు ఎలా చెల్లించాలని భార్యతో చెప్పుకుంటూ బాధపడే వాడు. ఈ క్రమంలో అతడు మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. స్థానికులు జమ్మికుంటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజకుమార్ తెలిపారు.

తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హుజూరాబాద్‌రూరల్, జనవరి 4: కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి పై లోడ్‌తో వెళ్తున్న లారీ మండలంలోని సింగాపూర్ గ్రామానికి చేరుకోగానే లారీ టైర్ల నుంచి మంటలు చేలరేగాయి. గమనించిన గ్రామానికి చెందిన ఇజ్జిగిరి ప్రభాకర్ అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించాడు. వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. సకాలంలో మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్, గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో లారీకి మంటలు



మంటలు అంటుకున్న లారీ

గంగాధర, జనవరి 4: గంగాధర మండలం ఒద్యారం గ్రామ పెంట్రోల్ పంపులో ప్రమాదవశాత్తు లారీకి మంటలు అంటుకుని క్యాబిన్ కాలిపో యింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రానైట్ లారీ సిబ్బంది స్థానిక హెచ్‌పీ పెట్రోల్ పంపులో డిజీల్ పోయిస్తున్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని క్యాబిన్ కాలిపోయింది, బంకులోనే మంటల్లో లారీ చిక్కుకుంది. పెంట్రోల్ పంపు సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. పంపులకు మంటలు వ్యాపించితే పెనుప్రమాదం జరిగేదని స్థానికులు వాపోయారు.

రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంటరూరల్, జనవరి 4: జమ్మికుంట వ్యవసా య మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,800 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 88 మంది రైతులు 894 క్వింటాళ్లు విడి పత్తి, తొమ్మిది మంది రైతులు 14 క్వింటాళ్లు గోనే సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,800, కనిష్ఠ ధర 5,500 రూపాయలు చెల్లించి కొనుగోలు చేశారు.

వారసంతలో దొంగల చేతి వాటం

హుజూరాబాద్, జనవరి 4: హుజూరాబాద్ వారసం తలో దొంగలు చేతి వాటం ప్రదర్శించారు. ప్రతి గురు వారం హుజూరాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట వారసంత జరుగుతుంది. పట్టణ ప్రజలు కూరగా యలు కొనుకునేందుకు మార్కెట్‌కు రాగా చందుపట్ల రాంమూర్తి అనే ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మూడు నెలల క్రితం కూడా ఇలాగే సెల్‌ఫోన్‌లు దొంగలిం చారు. వారసంతపై పోలీసులు నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

కౌన్సిలర్ భర్తపై కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 4: సిరిసిల్ల పట్టణంలోని 37వ వార్డు కౌన్సిలర్ భర్తపై గురువారం కేసు నమోదైంది. వార్డులో నిర్వహిస్తున్న ప్రజాపాలనలో మరో అంబికా నగర్ 23వ వార్డు నివాసి అయిన ఆడేపు చంద్రకళ దరఖాస్తు సమర్పించేందుకు రావడంతో కౌన్సిలర్ భర్త దిడ్డి రాజు అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు 37వ వార్డు కౌన్సిలర్ భర్త దిడ్డి రాజుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. ఇదే సంఘటనలో తనపైనే నలుగురు దాడికి యత్నించారని కౌన్సిలర్ భర్త దిడ్డి రాజు ఫిర్యాదు మేరకు ఆడేపు చంద్ర కళ, వంగరి దేవదాసు, కొక్కుల రాజు, గడ్డం కిరణ్‌లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● వరంగల్ ప్రాంతీయ విద్యా సంచాలకులు సత్యనారాయణరెడ్డి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 4: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వరంగల్ ప్రాంతీయ విద్యా సంచాలకులు సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చెల్పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలకు సమయం చాలా తక్కువగా ఉందన్నారు. సబెజ్టుల వారిగా ఉపాధ్యాయులు ప్రతిరోజు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల న్నారు. గత పరీక్షల్లో విద్యార్థుల పురోగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మానకొండూర్ బస్టాండ్

● 23 ఏళ్లుగా వినియోగంలోకి తీసుకురాని అధికారులు ● రోడ్డుపైనే బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ



మానకొండూర్‌లో నిరుపయోగంగా మారిన ఆర్టీసీ బస్టాండ్

మానకొండూర్, జనవరి 4: మానకొండూర్ ఆర్టీసీ బస్టాండ్ 23 ఏళ్లుగా ఉపయోగంగా ఉంది. లక్షలు వెచ్చించి బస్టాండ్ నిర్మించి రెండు దశాబ్దాలు దాటినా ఆర్టీసీ బస్సు ఇప్పటి వరకు వెళ్లలేదు. ఎవరూ పట్టించుకోకపోవడంతో రాత్రి వేళల్లో మందు బాబులకు అడ్డాగా మారింది. మరుగుదొడ్లు, మూత్రశాలలను ధ్వంసం చేసి నీటి కుళాయిలు పగులగొట్టారు. మెయిన్‌రోడ్డుపైనే బస్సులు నిలుపుతుండటంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని బస్టాండ్ లోపలికి బస్సులు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పదిహేను రోజుల వ్యవధిలో తల్లీతండ్రి మృతి

● అనాథలైన ఇద్దరు కూతుళ్లు

కోనరావుపేట, జనవరి 4: పదిహేను రోజుల క్రితం అనారోగ్యంతో తల్లీతండ్రి మృతి చెందడంతో వారి ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన నేరెళ్ల కనకవ్వ (54), దేవయ్య (60) కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వారు. వీరికి ఇద్దరు కూతుళ్లు గంగ, జమున ఉన్నారు. నేరెళ్ల కనకవ్వ పదిహేను రోజల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం దేవయ్య పక్షవాతంతో మృతి చెందాడు. తల్లీతండ్రి మృతి చెందడంతో వీరి కూతుళ్లు అనాథలుగా మారారు. దేవయ్య అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామస్థులు చందాలు పోగుచేసి అంత్యక్రియలు నిర్వహించారు. అనాథలైన ఆడపిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అక్రమ ఆయుధాల కేసులో మాజీ నక్సలైట్‌కు ఏడాది జైలు

సిరిసిల్ల క్రైం, జనవరి 4: అక్రమ ఆయుధాల కేసులో తంగళ్లపల్లి మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన జక్కుల బాబు అనే మాజీ నక్సలైట్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీలేఖ గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన జక్కుల బాబు సిపిఐ(ఎంఎల్) జనశక్తి నక్సలైట్‌గా ఏప్రిల్ 20, 2017న సిరిసిల్ల ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్లను బెదిరించి చందాలు వసూలు చేయాలని పథకం వేయగా జిల్లెల్ల చెక్ పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో ద్విచక్రవాహనంపై వెలుతున్న బాబు వద్ద ఒక పిస్టల్, 20తూటాలు లభించాయి. ఈ మేరకు తంగళ్లపల్లి పోలీసులు అక్రమ ఆయుధాల చట్టం క్రింద కేసు నమోదుచేసి బాబుని రిమాండ్‌కు తరలించారు. అప్పటి కేసు విచారణ అధికారి లక్ష్మారెడ్డి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రీకాంత్, హెడ్‌కానిస్టేబుల్ సిహెచ్. శంకర్, కోర్టు కానిస్టేబుల్ నవీన్‌లు 10మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీలేఖ అట్టి నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ. 2వేల జరిమానా విధించారని తంగళ్లపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

అనారోగ్య సమస్యతో ఆత్మహత్య

గంభీరావుపేట, జనవరి 4 : గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో అనారోగ్య సమస్యతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన తంగళ్లపల్లి శ్రీనివాస్ (53) అనే వ్యక్తి తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కటుంబ సభ్యులు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ కులవృత్తితో పాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. 3 ఏళ్లుగా శ్రీనివాస్ కడుపు నొప్పితో బాధపడుతూ పలు ఆసుపత్రులు తిరుగుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా కడుపునొప్పి తగ్గలేదు. దీనికి తోడు ఇటీవల బీపీ పెరగడం, రక్త కణాలు పెరగడంతో మళ్లీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. రోజు రోజుకు కడుపునొప్పి తట్టుకోలేక పోతున్నానని ఇంట్లో శ్రీనివాస్ చెబుతుండేవాడు. గురువారం ఉదయం శ్రీనివాస్ పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదు. వారి బంధువులు పొలం వద్దకు వెళ్లి చూసే సరికి చెట్టుకు ఉరివేసుకుని చనిపోయి ఉన్నాడు. అనారోగ్య కారణాలతోనే తన భర్త ఆత్మహత్య చేసకున్నాడని మృతుడి భార్య స్రవంతి పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహేష్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఏడుగురికి జైలు శిక్ష, జరిమానా

కరీంనగర్ క్రైం, జనవరి 4: కరీంనగర్‌లో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 29మంది వాహనదారులకు జైలుశిక్ష, జరిమానాలు పడ్డాయని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ మహ్మద్ సర్వర్ తెలిపారు. మద్యం సేవించి పట్టుబడిన ఏడుగురు వాహనదారులను గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఇందులో ఇద్దరు వ్యక్తులకు పది రోజుల జైలు శిక్ష, జరిమానా, ఐదుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్ష, జరిమానా విధించారని తెలిపారు. మరో 22 మంది వాహనదారులకు 42,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రతిరోజు కరీంనగర్ పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్, స్పెషల్ డ్రైవ్ ఉంటాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని అన్నారు. జైలు శిక్ష పడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా సస్పెండ్ చేయడానికి ఆర్టీఏ కార్యాలయానికి సిఫారసు చేస్తామని ఏసీపీ తెలిపారు.

ఉరేసుకొని వలస కూలీ ఆత్మహత్య

రుద్రంగి, జనవరి 4: రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం రాత్రి వలస కూలీ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా, పోండుమ్ గ్రామానికి చెందిన పాండ్రు రుద్రంగిలో భవన నిర్మాణ రంగంలో మేస్త్రీ వద్ద పనులు చేస్తున్నాడు. పిల్లలు కలగడం లేదని ఆవేదనతో పాటు, కుటుంబ కలహాలతో మనస్తాపం చెందాడు. రుద్రంగిలోని అద్దె భవనంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

రెండు రోజుల్లో వరదకాలువకు నీరు

- రైతులు ఆందోళన చెందవద్దు - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



వరద కాలువ

మల్యాల, జనవరి 4: రెండు రోజుల్లో వరదకాలుకు నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఈ మేరకు చీఫ్ ఇంజనీర్ సుధాకర‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి విడుదల జాప్యం పట్ల మండిపడుతూ వెంటనే నీటిని విడుదల చేయాలని అన్నారు. కాలువలో నీరు లేక నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులు సాగుకు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. దీంతో రెండు రోజుల్లో వరద కాలువకు నీరందిస్తామని సీఈ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. సాగుకు ఇబ్బంది లేకుండా నీరందిస్తామన్నారు.

రైస్‌మిల్లు తొలగించాలని కాలనీవాసుల ధర్నా



ధర్నాను విరమింపజేస్తున్న పోలీసులు

రాయికల్, జనవరి 4: రాయికల్ పట్టణంలోని 10వ వార్డులో ఏర్పాటు చేసిన రైస్‌మిల్లును తొలగించాలని కాలనీవాసులు గురువారం ధర్నా చేశారు. అంబేద్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన రైస్‌మిల్లు వలన చుట్టుపక్కల నివసించే ప్రజలకు రోగాలు వస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని వాపోయారు. రామగుండం నుంచి అధికారులు వచ్చి పరిశీలించినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ధర్నాకు ఎలాంటి స్పందన రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఎస్సై దేవేందర్ సిబ్బందితో వచ్చి వారికి నచ్చజెప్పి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నాలో డిఎస్‌పి మండల అధ్యక్షుడు పాలెపు జీవన్, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్రం రవీందర్, నిగ స్వామి, నిగ గంగరాజం, కాలనీవాసులు పాల్గొన్నారు.

గల్ఫ్ హామీలపై ఆశలు

● తీరని గల్ఫ్ బాధిత కుటుంబాల సమస్యలు

● భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ హామీ

● తెరపైకి గల్ఫ్ సంక్షేమ బోర్డు.. ఎన్‌ఆర్ఐ బోర్డు

జగిత్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భారత్ జోడో యాత్రలో భాగంగా సంగారెడ్డి జిల్లా నిజాంపేట వద్ద 2022 నవంబరు 6వ తేదీన సాయంత్రం ఇద్దరు గల్ఫ్ మృతుల కుటుంబ సభ్యులు రాహుల్ గాంధీని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కొండాపూర్‌కు చెందిన బచ్చల రాజనర్సయ్య షార్జాలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జమున రాహుల్‌ను కలిసిన బాధితుల బృందంలో పాల్గొని రాహుల్‌కు తమ బాధలను చెప్పుకుంది.

● నిర్మల్ జిల్లాకు చెందిన వలస కార్మికుడు మూడ అశోక్ అబుదాబిలో మృతి చెందాడు. అశోక్ 10 నెలల కూతురు సాత్విక, భార్య లక్ష్మీ రాహుల్‌ను కలిశారు. పసిపాప అమాయకపు చూపులు, గల్ఫ్ మృతుడి భార్య దీనావస్థ చూసి చలించిన రాహుల్ తన పక్కన ఉన్న అప్పటి మాజీ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆ కుటుంబానికి సహాయం చేయాలని సూచించారు.

● ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అభయహస్తం మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల సమస్యల అంశాన్ని ప్రస్తావించింది. 'గల్ఫ్ కార్మికులు, ఎన్‌ఆర్ఐల సంక్షేమం' పేరిట గల్ఫ్ సంక్షేమ బోర్డు, ఎన్‌ఆర్ఐల సంక్షేమ బోర్డు, గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గేషియా చెల్లింపు, టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ఏర్పాటు అను నాలుగు హామీలను ఎన్నికలలో వివిధ సందర్భాల్లో కాంగ్రెస్ ఇచ్చింది. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ గల్ఫ్ బాధితులకు సానుభూతి మాటలు తప్ప ఎటువంటి సహాయం చేయలేక పోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రభుత్వ పక్షాన గల్ఫ్ బాధితులకు ఆర్థిక సహాయం అందుతుందని, హామీలు నెరవేరుతాయన్న ఆశతో గల్ఫ్ కుటుంబాలు ఉన్నాయి.

సుమారు 15 లక్షల మంది గల్ఫ్ కార్మికులు

గల్ఫ్ దేశాలలో తెలంగాణ ప్రాంతానికి చెందిన వలస కార్మికులు సుమారు 15 లక్షల వరకు ఉంటారని అంచనా ఉంది. ఇందులో కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 3 లక్షలు, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 2.50 లక్షలు, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 1.80 లక్షల మంది వివిధ దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లినట్లు అంచనాలున్నాయి. ఇందులో అత్యధికంగా యూఏఈ, సౌదీ అరేబియా



ఆర్మూర్ వద్ద రాహుల్‌తో గల్ఫ్ బాధిత కుటుంబాలు(ఫైల్)

కాగా కువైట్, ఓమన్, ఖతార్, బహ్రెయిన్, మలేషియా, సింగపూర్ దేశాల్లో జిల్లాకు చెందిన పలువురు వలస కార్మికులు పనులు చేస్తున్నారు. అదే విధంగా పదేళ్లలో ఏడారి దేశాల నుంచి మరో సుమారు 15 లక్షల మంది వివిధ కారాణాలతో వాపస్ వచ్చి గ్రామాలలో సరైన ఉపాధి లేక ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నట్లు గల్ఫ్ సంక్షేమ సంఘాల నేతలు అంటున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో గల్ఫ్ సంఘాల నేతల పోటీ

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గల్ఫ్ సంఘాల నేతలు పోటీ చేశారు. ప్రధానంగా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బరిలో దిగారు. జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం నుంచి గల్ఫ్ సంఘాల నేత చెన్నమనేని శ్రీనివాస్ రావు, ధర్మపురి నియోజకవర్గం నుంచి గల్ఫ్ వలస కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న గల్ఫ్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బూత్కూరి కాంత, సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం నుంచి గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవి గౌడ్, నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు పరికిపండ్ల స్వదేశ్‌లు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థులుగా, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక అధ్యక్షుడు దొనికెల కృష్ణ పోటీ చేసి గల్ఫ్ సమస్య జాతీయ స్థాయిలో తెరపైకి వచ్చేలా ప్రయత్నించారు.

అపరిష్కృతంగా సమస్యలు

ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలు, ఇతర దేశాలకు వలస వెళ్లిన కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయి. పదేళ్లలో గల్ఫ్ దేశాలలో మృతి చెందిన సుమారు రెండు వేల మంది తెలంగాణ వలస కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా, గల్ఫ్ బాధితులను ఆదుకోవడానికి రూ. 500 కోట్ల వార్షిక బడ్జెట్ కేటాయింపు, గల్ఫ్ బోర్డు, ఎన్‌ఆర్ఐ బోర్డు, సమగ్ర ఎన్‌ఆర్ఐ పాలసీ తదితర డిమాండ్‌లు నెరవేరడం లేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలై కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో గల్ఫ్ బాధిత కుటుంబాల్లో మరోమారు ఆశలు చిగురిస్తున్నాయి.

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో 2018 నవంబరు 29వ తేదీన జరిగిన ఎన్నికల ప్రచార సభలో జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన గల్ఫ్ విడో దండుగుల లక్ష్మీ తమ పిల్లలను వెంటబెట్టుకొని వచ్చి రాహుల్ గాంధీని కలిసి తమ బాధలు చెప్పుకుంది. ఒమన్ వెళ్లిన తన భర్త దండుగుల జనార్ధన్ అక్కడే గుండెపోటుతో మృతి చెందాడని, ఉన్న ఆధారం కోల్పోవడంతో తన ఇద్దరు పిల్లలు శశాంత్, అనిరుద్ జీవనం సాగించడం కష్టంగా మారిందని లక్ష్మీ ఆవేదన వ్యక్తం చేసింది. తమ ప్రభుత్వం వస్తే తప్పకుండా ఆదుకుంటామని రాహుల్‌గాంధీ వారికి హామీనిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దండుగుల లక్ష్మీ లాంటి అనేక కుటుంబాలు సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో ఉన్నారు.

నాలుగు హామీలు అమలు చేయాలి

- మంద భీంరెడ్డి, ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు



ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఎన్‌ఆర్ఐ సంక్షేమ బోర్డు, గల్ఫ్ సంక్షేమ బోర్డు, గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా, టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ఏర్పాటు నాలుగు హామీలు అమలు చేయాల్సిన అవసరముంది.

ఆటో, లారీ ఢీ : ఆరుగురికి గాయాలు

అంతర్గాం, జనవరి 4: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డు వద్ద గురువారం లారీ, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం అందుగులపల్లికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు కొయ్యడ నారాయణ, చంద్రశేఖర్, కనుకమ్మ, నందిని, రిషిత, మేఘనలు గోలివాడ గోదావరి నదికి స్నానాలకు వెళుతున్నారు. అదే సమయంలో బ్రాహ్మణపల్లి నుంచి రామగుండం వెళుతున్న లారీ బ్రాహ్మణపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు గాయాలపాలయ్యారు. అంతర్గాం పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ అంతగిరి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.



ప్రమాదానికి గురైన ఆటో, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

విద్యుత్ మోటార్లు, కేబుళ్లను చోరీ చేస్తున్న వ్యక్తి పట్టివేత

కోల్‌సిటీ, జనవరి 4: గోదావరిఖనిలోని నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లలో విద్యుత్ వైర్లను, గ్రామంలోని పొలాల వద్ద ఉన్న మోటార్లను, విద్యుత్ వైర్లను చోరీ చేస్తున్న ఎన్‌టీపీసీ పోరట్‌పల్లికి చెందిన మేకల రాకేష్ అనే వ్యక్తిని గోదావరి వంతెన వద్ద జనగామ గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మార్కండేయకాలనీ, దుర్గానగర్, ఆర్‌టీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లలో విద్యుత్ వైర్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోగా ఎన్‌టీపీసీకి చెందిన నలుగురు ఒక ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్టు తెలుస్తున్నది. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నారు.

ధర్మపురిలో కాలభైరవుడి ఆలయం ప్రారంభం

ధర్మపురి, జనవరి 4: ధర్మపురి క్షేత్రంలోని ఇసుక స్తంభం పక్కన కాలభైరవుడి ఆలయాన్ని గురువారం ప్రారంభించారు. ధర్మపురి వాసి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గోలి పూర్ణచందర్ దంపతులు రూ 5.50 లక్షలు స్వంతంగా ఖర్చు చేసి ఈ ఆలయాన్ని నిర్మించారు. స్థానిక వేదపండితులు మధు శంకర్‌శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, పాలెపు శివ, జ్యోతిష్య పండితులు పాలెపు బద్రీనాథ్‌శర్మ ఉదయం శాస్త్రోక్తంగా అభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, 11 వ వార్డు కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ఆలయ నిర్మాతలు డాక్టర్ గోలి పూర్ణచందర్ దంపతులు, గోలి రాంకిషన్, గోలి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.



కాలభైరవుడి ఆలయ ప్రారంభ పూజలు

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

కొడిమ్యాల, జనవరి 4: మండల కేంద్రంలోని (విద్యా భారతి)విజ్డమ్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న మండల కేంద్రానికి చెందిన ఎర్రోజు తక్షిల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 23 వరకు (67వ)జాతీయ స్థాయిలో నిర్వహించే అండర్ 17 క్రికెట్ క్రీడలకు ఎంపికైనట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీరాజంనాయక్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 17 క్రికెట్ జట్టు కోచ్ లింగంపెల్లి డేవిడ్‌సన్ బుధవారం తెలిపారు. బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో తెలంగాణ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. గద్వాల్‌లో గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొని అత్యధిక పరుగులు(143)సాధించి బ్యాట్స్ మెన్‌గా మొదటి స్థానంలో నిలిచాడు. ప్రస్తుత్తం హైదరాబాదులోని భవన్స్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఎర్రోజు తక్షిల్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావటం పట్ల క్రీడాకారునికి విజ్డమ్ పాఠశాల ప్రిన్సిపాల్ దీకొండ అశోక్, కొడిమ్యాల క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు రాపర్తి లక్ష్మన్, సభ్యులు అభినందించారు.



తక్షిల్ (ఫైల్)

మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, జనవరి 4 : నాంపల్లి గుడిబండ చెరువులో మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గుడిబండ చెరువులో మృతదేహం గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారని, దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో నుంచి మృతదేహన్ని వెలికితీయగా నిజామాబాద్ జిల్లా మెండోర మండలం పోచంపపాడు గ్రామానికి చెందిన చిట్యాల రామకృష్ణ అలియాస్ రాజేష్(45)గా గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 4: నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరగనున్న పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-14 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్ల వివరాలను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ గురువారం ప్రకటించారు. ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 6వ తేదీలోపు ఎలిజిబులిటీ ఫామ్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్స్, ఆధార్ జిరాక్స్‌లు నాలుగు సెట్లు తీసుకుని కార్యదర్శిచే సంతకం చేయించుకోవాలన్నారు.

బాలికల విభాగంలో..

సీహెచ్ అక్షయ(గుల్లకోట), కె తేజని(గుల్లకోట), వి శరణ్య(గుల్లకోట), బి శ్రీనిధి (గుల్లకోట), పి మిత్ర(జగిత్యాల), పి అపూర్వ(మొగిలిపాలెం), ఎం సహస్రమా ల(జగిత్యాల), డి శ్రీహర్షిణి(ఇల్లందకుంట), నందిని(కరీంనగర్), జి హన్సిక(కరీం నగర్), జి అక్షర(నందిమేడారం), వి శివాణి(చొప్పదండి), ఎస్ సాయిశర ణ్య(మొగిలిపాలెం),బి వర్షిత(నగునూరు), ఎ రమాదేవి(మానకొండూర్), సహలసామ(కరీంనగర్)లు ఎంపికయ్యారు.

బాలుర విభాగంలో..

ఎల్ సిద్ధు(గుల్లకోట), పి ఆర్యన్(గుల్లకోట), జి మణితేజ(గుల్లకోట), పి వివేక్(తాటిపల్లి), కె వినయ్(వేగురుపల్లి), ఎం రఘు(వేగురుపల్లి), బి రాంచరణ్(అన్నారం), చంద్రశేఖర్ రెడ్డి(మొగిలిపాలెం), ఆర్ సామ్యూల్(ధర్మారం), ఓ ఈశ్వర్(కరీంనగర్), జి రాంచరణ్(చొప్పదండి),జైశంత్(తాటిపల్లి),ఆశిష్‌రెడ్డి(మొగిలిపాలెం), జె నీరవ్(కరీంనగర్), ఎం శివతేజ(పెద్దపల్లి), సీహెచ్ మహేందర్ రెడ్డి(ఊటూరు) ఎంపికయ్యారు.

ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన నిందితుడి పట్టివేత

జగిత్యాల టౌన్, జనవరి 4 : జగిత్యాల జిల్లా కేంద్రంలో కొన్ని రోజులుగా ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్తున్న నిందితుడిని జగిత్యాల పట్టణ పోలీసులు పట్టుకున్నారు. గురువారం రాత్రి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వెంకటస్వామి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని తారకరామ నగర్ ప్రాంతానికి చెందిన బాణాల చిరంజీవి అనే యువకుడు వ్యసనాలకు బానిసై దొంగగా మారాడు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని తమ ఇళ్ల ముందు నిలిపిన వాహనాలను అపహరించుకవెళ్లి విక్రయించి సొమ్ముచేసుకోవడం చిరంజీవి ప్రవృత్తిగా మార్చుకున్నాడు. వరుసగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురి కావడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టౌన్ సీఐ నటేష్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో అనుమానస్పద స్థితిలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి పట్టుకుని విచారించారు. ద్విచక్ర వాహనాల దొంగగా గుర్తించి 10 వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ వివరించారు.



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ

ఆగని ఇసుక అక్రమ దందా

● అనుమతులు లేకున్నా సరఫరా

ఎల్లారెడ్డిపేట, జనవరి 4: ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ఎల్లారెడ్డిపేట మండలంలో ఇసుక వ్యాపారులు నిరంతరం వాగుల్లోని ఇసుకను ట్రాక్టర్లు, పికప్‌లు, టిప్పర్లలో జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. మండలంలోని పదిర, వెంకటాపూర్, అగ్రహారం, సింగారం శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమార్కులు తరలిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పనుల కోసం స్థానిక తహసీల్ అధికారులు ప్రతి బుధ, శనివారాల్లో వెంకటాపూర్ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుక రవాణాకు అనుమతి జారీ చేస్తున్నారు. ఇటీవల అనుమతి లేకుండానే ఇసుక తరలింపు కొనసాగుతోంది. ఓ శాఖ అధికారులు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. తహసీల్ కార్యాలయంలోని ఓ అధికారి తన సమీప బంధువును మధ్యవర్తిగా ఏర్పాటు చేసుకొని దందాకు తెరలేపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక రవాణా చేయాలంటే క్యూబిక్ మీటర్ లెక్కన బ్యాంకులో డీడీ చెల్లించి తహసీల్దార్ అనుమతి పొందాలి. ఇక్కడ అలాంటిదేమీ మచ్చుకైనా కనిపించడం లేదు. కార్యాలయానికి సమీపంలోని ఓ దుకాణంలో సదరు అధికారి బంధువును కలిసి వ్యాపారులు పైకం ఇచ్చుకుంటే చాలు ఎన్ని ట్రిప్పుల ఇసుకనైనా తరలించుకోవచ్చు. ఒక్కో ట్రాక్టర్‌కు ప్రతివారం రూ.1500, పికప్‌కు రూ.3వేలు, టిప్పరుకు రూ.10 వేల చొప్పున డబ్బు పుచ్చుకుంటున్నారనే విమర్శలున్నాయి. బుధ, శనివారాల్లో సుమారు 50 ట్రాక్టర్లు, 20 వరకు పికప్‌లు, 10 టిప్పర్లు ఇసుకను రవాణా చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక దందాతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ప్రభుత్వ ఖాతాలో జమకావాల్సిన సొమ్ము కొంతమంది అధికారుల జేబుల్లోకి వెళ్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో గ్రామం నుంచి ప్రతీ బుధ, శనివారాల్లో నడిచే ట్రాక్టర్ల వ్యాపారులు కలిపి రూ.10 వేలు చెల్లించాలని నిర్ణయించినట్లు ఆరోపణలు ఉన్నాయి.



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

డీడీలు చెల్లిస్తేనే అనుమతి

రాంచందర్, తహసీల్దార్, ఎల్లారెడ్డిపేట

మండలంలో ఇసుక తరలింపునకు డీడీలు చెల్లిస్తేనే అనుమతులు జారీ చేస్తున్నాం. ఎలాంటి అవకతవకలు ఉన్నా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరిస్తాం.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

రమాకాంత్, ఎస్సై, ఎల్లారెడ్డిపేట

అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటున్నాం. అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. అనుమతి పత్రం ఉండి సమయం దాటి పోయినా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నాం.

కలెక్టర్‌కు టీఎన్‌జీవో న్యూ ఇయర్ శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్‌జీవో ప్రతినిధులు

సిరిసిల్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా గురువారం జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ప్రతినిధులు కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమికి గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీన్‌కుమార్, కార్యదర్శి గాజుల సుదర్శన్, శ్రీకాంత్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల టౌన్, జనవరి 4: బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన బీఆర్ఎస్ - 2024 క్యాలెండర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసన సభ్యుడు కేటీఆర్ హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం ఆవిష్కరించారు. నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, దూస వినయ్, మాజీ కౌన్సిలర్ దార్ల సందీప్, సిరిసిల్ల మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ బైరి ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన కటకం

గంభీరావుపేట, జనవరి 4 : ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం గురువారం కలిసారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కటకం మృత్యుంజయం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



బట్టి విక్రమార్కతో మృత్యుంజయం

వెంకట్రావుపేటలో కేంద్ర బృందం పర్యటన



వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

కోనరావుపేట, జనవరి 4: కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో గురువారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన కేశవరావు చెరువును జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు లక్ష్మీనారాయణ, దామోదర్ పరిశీలించారు. సర్పంచ్ మంతెన సంతోష్, డీఆర్డీవో శ్రీనివాస్, అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, ఎంపీడీవో రామకృష్ణ, అడిషనల్ పీడీ రవికుమార్, ఏపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామమందిరం అక్షింతల పంపిణీ

ఇల్లంతకుంట, జనవరి 4: మండలంలోని వల్లంపట్ల, ఇల్లంతకుంట గ్రామాలలో రామజన్మభూమి, అయోధ్య రామమందిరం అక్షింతలను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి అనసూయనర్సింహరెడ్డి, వీహెచ్‌పీ అధ్యక్షుడు ఏగుర్ల శ్రీనివాస్, మామిడి పర్శరాం, నార్ల రాంకిషన్, బోనగిరి కిషన్ తదితరులు పాల్గొన్నారు..

బీఆర్ఎస్‌ను బలోపేతం చేస్తాం

కరీంనగర్ టౌన్, జనవరి 4: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో గంగుల కమలాకర్ ప్రసంగించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కేడర్‌తో కలిసి కట్టుగా కష్టపడి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించుకుంటామని అన్నారు. ఎంపీగా వినోద్‌కుమార్ లేకపోవడంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఆశించిన మేరకు జరుగలేదని, చాలా పనులు నిలిచిపోయాయని అన్నారు. అయినా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కే ఎక్కువ ఓట్లు వచ్చాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు ఆ పార్టీకి ఓట్లు వేసి గెలిపించారని చెప్పారు. ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా అమలు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు గుర్తు చేస్తున్నామని కమలాకర్ అన్నారు. ముగ్గురు బీజేపీ సీఎం అభ్యర్థులను బీఆర్ఎస్ ఓడించిందని ఈ సందర్భంగా కమలాకర్ గుర్తు చేశారు. ఇప్పటి వరకు రైతుబంధు డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయలేదని, దీంతో రైతులు నాట్లు వేసుకునేందుకు, విత్తనాలను కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు నాట్లు వేసుకోవాలా వద్దా అని ఆలోచిస్తున్నారని, డిసెంబరు 9వ తేదీన ఇవ్వాల్సిన ఆసరా పెన్షన్లు జనవరి 3వ తేదీ వరకు కూడా ఇవ్వలేదని, లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలతోపాటు ప్రజా సమస్యలపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు.

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

గంభీరావుపేట, జనవరి 4 : జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగు, సాగునీరు, విద్య, వైద్య రంగాల్లో జిల్లాను ముందు వరుసలో నిలబెడతానన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను పెద్ద మనసుతో ఆశీర్వదించి, పట్టం కట్టిన ప్రజానీకానికి ధన్యవాదాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన మొదటి వారంలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలులోకి తెచ్చామన్నారు. గతంలో ప్రజలకు ఏదైన పని పడితే కార్యాలయాలకు వద్దకు వెళ్లేవారని, ఇప్పుడు ప్రజల వద్దకే పాలన కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. గతంలో రైతులకు ఉచిత కరంటు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఇప్పుడు గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరంటు అందించే పథకాన్ని తెచ్చింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. 2014 కంటే ముందు గ్యాస్ సిలిండర్ రూ.45 ఇచ్చింది ప్రభుత్వమేనని, ఇప్పుడు రూ.500కు గ్యాస్ సిలిండర్ ఇచ్చేది కాంగ్రెస్సేనని అన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వక పోవడంతో ప్రజాపాలనలో ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయన్నారు. అంతకు ముందు గ్రామ పంచాయతీ వద్ద ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు సన్మానించారు. పీసీసీ కార్యదర్శి నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొండూరు గాంధీ, సీనియర్ నాయకులు గడ్డం నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, ఎంపీటీసీ పర్శ రాములు, వార్డు సభ్యుడు నుషరత్, నాయకులు కిషన్‌గౌడ్, సురేష్, ఎర్ర నర్సయ్య, లక్ష్మీనారాయణ, స్వామి, ప్రబాకర్, రాజులు, బిక్షపతి, వెంకటి, బాలకిష్ట, యాసీన్ ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట : రాజకీయాలకు అతీతంగా ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు అగ్రహారం, రాగట్లపల్లి, గుండారం గ్రామాల్లో గురువారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించేందుకు చర్యలు చేపడుతోందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామన్నారు. అర్హులైన వారందరికీ మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలను అందించేందుకే ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను చేపట్టామన్నారు. అంతకు ముందు ప్రభుత్వ విప్‌గా నియమితులై మొట్టమొదటి సారిగా ఎల్లారెడ్డిపేటకు వచ్చిన ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. స్థానిక వేణుగోపాలస్వామి బాలాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరారు. సర్పంచులు వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్, అమృత, సుజాత, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు అనసూయ, బాబు, తిరుపతిబాబు, మల్లేశం, తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీవో చిరంజీవి, నాయకులు గడ్డం నర్సయ్య, నాగుల సత్యనారాయణ, నర్సయ్య, లక్ష్మారెడ్డి, కృష్ణమూర్తి, రాజయ్య, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

సారూ.. అనాథను ఆదుకోరూ..

ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలనలో మండల కేంద్రానికి చెందిన బాలిక నూర్జహన్‌బేగం తాను అనాథనని, ఆదుకోవాలని ఆది శ్రీనివాస్ ఎదుట కన్నీళ్లు పెట్టుకుంది. చలించిన ఆయన బాలిక వివరాలను తెలుసుకున్నారు. తన తల్లి షాజానాబేగం ఏడాది కిందట అనారోగ్యంతో మృతి చెందిందని తెలిపింది. వారం రోజుల క్రితం తండ్రి సలావుద్దీన్ గుండెపోటుతో చనిపోయాడని పేర్కొంది. కూలీ పనులు చేస్తూ జీవించే తన తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందడంతో ఒంటరిగా మిగిలానని వాపోయింది. కుటుంబ పరిస్థితి సరిగా లేకపోవడంతో ఏడాది కిందట ఇంటర్ మధ్యలోనే చదువు మానేశానని ఆవేదన వ్యక్తం చేసింది. ఆదుకుంటామని ఆది శ్రీనివాస్ బాలిక నూర్జహన్‌బేగంకు భరోసా ఇచ్చారు.



గంభీరావుపేటలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ముస్తాబాద్: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ముస్తాబాద్, పోతుగల్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాలకు ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని అన్నారు. పోతుగల్ గ్రామంలో పురాతన రామాలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, బీసీ విభాగం మండల అధ్యక్షుడు శీల ప్రశాంత్, సర్పంచ్ సుమతి, నాయకులు బుర్ర రాములు, గజ్జెల రాజు అరుట్ల మహేశ్‌రెడ్డి తాళ్ల విజయ్‌రెడ్డి, పెద్దిగారి శ్రీనివాస్, రంజాని నరేశ్, సారుగు రాకేశ్, గుండెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం పరిశీలించారు. వేములవాడ మండలం చీర్లవంచలో మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులోని దరఖాస్తుల స్వీకరణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు ఇచ్చేందుకు వస్తున్న ప్రజలకుఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీపీవో రవీందర్, ఎంపీడీవో శ్రీధర్, సర్పంచ్ రంగు సత్తమ్మ, ఎంపీటీసీ దేవరాజు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, రమేష్ తదితరులు ఉన్నారు.

వేములవాడ రూరల్: ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన సదస్సుల్లో ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతీ ఒక్క కుటుంబం నుంచి దరఖాస్తు స్వీకరిస్తామని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మండలంలోని మల్లారంలోని ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. మర్రిపల్లి, జయవరంలో నిర్వహించిన ప్రజాపాలనతో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. డీపీవో రవీందర్, డీపీఆర్వో దశరథం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీపీ బండ మల్లేశం, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



చీర్లవంచలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇల్లంతకుంట : అర్హులైన ప్రతీ ఒక్కరి సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లె, సిరికొండ, తెనుగువానిపల్లె, రామోజీపేట, చిక్కుడువాణిపల్లెలో గురువారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు అమలుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నిరుపేదలకు అండగా నిలువాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచులు మంద సుశీలలింగయ్య, నీలం లక్ష్మిఅంజయ్య, అనసూయచంద్రారెడ్డి, మేఘలవ్వ, లాల రాధ, ఎంపీటీసీలు స్వప్న, పర్శరాం, పుష్పలత, ఉపసర్పంచ్ బాలగౌడ్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలంలోని ఓబులాపూర్, పాపయ్యపల్లె, పద్మనగర్, రాళ్లపేటలో గురువారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ పుర్మాణి మంజుల లింగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు ముదారి పోశయ్య, నందగిరి నర్సయ్య, బాలసాని పర్శరాములు, నక్క రేవతి, సిలివేరి ప్రసూన్న నరసయ్య, ములిగే దుర్గాప్రసాద్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో లచ్చాలు, కాంగ్రెస్ నాయకులు లింగారెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

చందుర్తి : రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. మండలంలోని మర్రిగడ్డ, మల్యాల గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గురువారం ప్రజాపాలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత, యువ వికాసం పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు చేరువగా పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో ప్రదీప్, ఏపీఎం రజిత, పీఆర్ఏఈ వెంకటేశ్వర్లు, సర్పంచులు జలపతి, లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

రుద్రంగి: అర్హులైన ప్రతీ ఒక్కరు ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకోవాలని వైస్ ఎంపీపీ పిసరి చిన్నభూమయ్య అన్నారు. రుద్రంగి మండలం సర్పంచ్ తండా గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారెంటీలకు సంబంధించిన 183 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఎంపీడీవో శంకర్, ఎంపీవో సుధాకర్, కార్యదర్శి నాగరాజు, వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ



దరఖాస్తులు స్వీకరిస్తున్న జడ్పీటీసీ నాగం కుమార్

ఉచిత బస్సు ప్రయాణంపై బీఆర్ఎస్ రాజకీయం

సిరిసిల్ల టౌన్, జనవరి 4: తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులో ప్రయాణించే మహిళలతో మాట్లాడారు తెలంగాణలో అధికారం పోవడంతో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం, పథకాలపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నష్టం వాటిల్లకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామన్నా బీఆర్ఎస్ నాయకులు కొందరు రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిరిసిల్ల పట్టణ వార్డుల, అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అరుణ, మాజీ కౌన్సిలర్ ఆడెపు చంద్రకళ పాల్గొన్నారు.



బస్సులో మహిళలతో మాట్లాడుతున్న వనిత

గ్యారెంటీ పథకాలు అమలు చేస్తాం

శంకరపట్నం, జనవరి 4: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండలంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. మండలంలోని ముత్తారం, రాజాపూర్, మెట్‌పల్లి గ్రా మాల్లో అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. అర్హులైన వారందరూ అభయహస్తం గ్యారంటీ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇప్పటికి రెండు పథకాలను అమలు చేశామన్నారు. మిగతా గ్యారంటీలను కూడా సకాలంలో అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నిజాయితీగూడెం, పచ్చునూర్, పెద్దూరుపల్లి గ్రామాలలో గురువారం ప్రజాపాలన గ్రామ సదస్సులు జరిగాయి. పచ్చునూర్‌లో జరిగిన గ్రామసదస్సులో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు ఎంపీడీవో రాజేశ్వర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: ప్రతి నియోజకవర్గానికీ మూడు నుంచి ఐదు వేల వరకు ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతలో మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరా మని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని పోరండ్ల, నుస్తులాపూర్ గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ జయశంకర్, సర్పంచ్‌లు రెడ్డి త్రివేణి తిరుపతి రెడ్డి, రావుల రమేష్, తహసీల్దార్ కనకయ్య ఎంపీడీవో రవీందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ మెస్ బిల్లులు విడుదల చేయాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 4: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల హాస్టల్స్ మెస్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అందుబాటులో లేక పోవడంతో ఏవో రాజిరెడ్డికి వినతిపత్రం అంజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సోషల్ , బీసీ, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్ హస్టళ్లలో ఐదు నెలల నుంచి దాదాపు రూ. 5485 కోట్ల మెస్ బిల్లులు పెండింగ్‌లు ఉన్నాయన్నారు. విద్యార్థులకు మెస్ బిల్లుల రాకపోవడంతో ఆర్థిక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడదల చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. ప్రభుత్వం స్పందించక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పెండేల దిత్య చిర్ర వేణు, సంతోష్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది ఐదు రోజులే

- ఈ-చాలన్‌ల చెల్లింపునకు 10న ముగియనున్న గడువు
- ఇప్పటివరకు రూ.44లక్షలు చెల్లింపులు
- సద్వినియోగం చేసుకుంటున్న వాహనదారులు


సిరిసిల్ల క్రైం, జనవరి 4: జిల్లాలో వాహనాల పెండింగ్ ఈ-చాలన్‌ల చెల్లింపునకు స్పందన లభిస్తోంది. వాహనాల పెండింగ్ ఈ-చాలన్‌ల డిస్కౌంట్ మేళా గడువు ఐదు రోజులే మిగిలి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 26న పెండింగ్ ఈ-చాలన్‌ల చెల్లింపునకు భారీ రాయితీ ప్రకటించింది. ప్రధానంగా ద్విచక్రవాహనాలకు 80శాతం, కార్లు, లారీలు, ఇతర భారీ వాహనాలకు 60శాతం, ఆర్టీసీ వాహనాలకు 90శాతం రాయితీ ప్రకటించింది. ఈ రాయితీ ద్వారా పెండింగ్ ఈ-చాలన్‌లు ఈనెల 10లోగా చెల్లించాల్సి ఉంది. తరచూ వెబ్‌సైట్ సర్వర్ డౌన్ కావడంతో ఆన్‌లైన్‌లో ఈ-చాలన్‌ల చెల్లింపునకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2018నుంచి డిసెంబరు 26వరకు 3,50,667 వాహనాలపై పెండింగ్ ఈ- చాలన్‌లు ఉన్నాయి. దీంతో జిల్లాలో రాయితీ లేకుండా ట్రాఫిక్ ఈ-చాలన్‌ల ద్వారా బకాయిలు 10 కోట్ల 5 లక్షల 50 వేల195 రూపాయలు చెల్లించాలి. జిల్లాలో అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, హెల్‌మెట్, సీట్ బెల్ట్, రాంగ్ పార్కింగ్ తదితర వాటిపై నిఘా కెమెరాల్లో క్లిక్ అనిపించి జరిమానా వేశారు. ఐదేళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఈ-చాలన్‌ల చెల్లింపునకు భారీ రాయితీ ప్రకటించడంతో వాహనదారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 68,444 ఈ-చాలన్‌ల ద్వారా రూ.44 లక్షలు చెల్లించారు. ఇంకా 2,82,223 ఈ-చాలన్‌లు చెల్లించాల్సి ఉంది. వారం రోజుల్లో కేవలం 20శాతం వాహనదారులు రాయితీ అవకాశాన్ని వినియోగించుకున్నారు. మిగతా వాహనదారులు పెండింగ్ ఈ-చాలన్‌ల చెల్లింపునకు ఐదు రోజులే గడువు ఉంది.



వాహన పత్రాలు పరిశీలిస్తున్న పోలీసులు

సద్వినియోగం చేసుకోవాలి

- అఖిల్ మహాజన్, ఎస్పీ



ఈ-చాలన్‌ల చెల్లింపు డిస్కౌంట్‌ను వాహన దారులు సద్వినియోగం చేసుకోవాలి. వాహనాలపై జరిమానా లేకుండా చూసుకోవాలి. తెలంగాణ ఈ-చాలన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే, మీ సేవ, ఈ సేవల ద్వారా చెల్లించవచ్చు.

ప్రాజెక్టు పనుల్లో నాణ్యతా లోపం

- ఇష్టానుసారంగా పనులు - పట్టించుకోని అధికారులు

కోనరావుపేట, జనవరి 4 : కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు కట్ట పనుల్లో నాణ్యత లోపించిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పక్కనే ఉన్న రెవెన్యూ గుట్ట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తూ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా పనులు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి ప్రాజెక్టు కట్ట మరమ్మతు, సుందరీకరణ పనులను ఎనిమిది నెలల క్రితం ప్రారంభించారు. కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఎత్తిపోతల పథకంలో భాగంగా 165 కోట్ల రూపాయలతో మల్కపేట రిజర్వాయర్ నుంచి నిమ్మపల్లి ప్రాజెక్టు నింపడానికి అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో నుంచి నిమ్మపల్లి ప్రాజెక్టు మత్తడి, కట్ట మరమ్మతు సుందరీకరణ కోసం 2 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న కంపెనీ పనులు ప్రారంభించింది. వేగంగా పనులు చేపడు తున్నా అనుమతులు లేకుండా పక్కనే ఉన్న రెవెన్యూ గుట్ట నుంచి మట్టి తరలిస్తున్నారు. గుట్ట పైన ఉన్న చెట్లను తొల గించి వేర్లు, పెద్ద బండరాళ్లతో కట్ట మరమ్మతు చేపడు తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో కట్ట బలంగా ఉండదని, దెబ్బతినే పరిస్థితి తలెత్తుతుందని నిమ్మపల్లి వాసులు పేర్కొం టున్నారు. కట్ట పైన ఇరుపక్కల పిల్లర్ల నిర్మాణం లోనూ నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతో కూలి పోతు న్నాయని ఆరోపిస్తు న్నారు. ఇప్పటికైనా ఉన్నతా .ధికారులు స్పందిం చాలని, నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని నిమ్మపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.



గుట్ట నుంచి తరలించిన మట్టి



వేర్లతో ఉన్న మట్టి